సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా
శనివారం । 2 । నవంబర్ । 2024



సందడిగా దీపావళి 9లో

దీపావళి పండగను జిల్లావ్యాప్తంగా ఘనంగా జరుపుకున్నారు. విద్యుత్ దీపాలతో అందంగా అలంకరించారు.



ఘనంగా క్షీరాభిషేక సేవ

విశాఖ: నగరంలోని బురుజుపేటలో వెలసిన కనకమహాలక్ష్మి అమ్మవారికి శుక్రవారం క్షీరాభిషేక సేవ నిర్వహించారు.



కరెన్సీతో అలంకరణ

అనకాపల్లి: తుమ్మపాలలో ఏర్పాటు చేసిన అయ్యప్ప పీఠంలో స్వామి, ధనలక్ష్మి మాతను కరెన్సీతో అలంకరించారు.

న్యూస్‌రీల్

మరింత మెరుగ్గా విద్యా బోధన

- డీఈవో బ్రహ్మాజీరావు ఆదేశం



మాట్లాడుతున్న డీఈవో బ్రహ్మాజీరావు

డుంబ్రిగుడ: విద్యార్థులకు మరింత మెరుగ్గా బోధించాలని జిల్లా విద్యాశాఖాధికారి బ్రహ్మాజీరావు ఆదేశించారు. స్థానిక గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో రెండో విడత సరియైన స్థాయిలో బోధనపై శిక్షణ కార్యక్రమం శుక్రవారం ప్రారంభమైంది. ఉపాధ్యాయులకు ఈనెల 3వ తేదీ వరకు జరుగుతుంది. ఈ శిబిరాన్ని డీఈవో సందర్శించారు. ఉపాధ్యాయులకు పలు సూచనలు చేశారు. విద్యార్థులకు ఉత్తమ బోధన ద్వారా మంచి భవిష్యత్తు ఇవ్వాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఎంఈవో శెట్టి సుందరరావు, రిసోర్స్‌పర్సన్లు సుబ్బారావు, కామరాజు, రామరావు, శ్రీనివాసరావు, రమేష్, సీఆర్పీలు నాగేంద్ర, కాంతారావు, సింహాబలుడు, కిరణ్ పాల్గొన్నారు.

టెంట్ల ఏర్పాటుకు అనుమతులు తప్పనిసరి

అరకులోయ రూరల్: ప్రముఖ పర్యాటక కేంద్రమైన అరకులోయ పరిసరాల ప్రాంతాల్లో తాత్కాలికంగా క్యాంపియన్ టెంట్లు ఏర్పాటుచేస్తున్న నిర్వాహకులు అనుమతికోసం మండల పరిషత్ కార్యాలయంలో దరఖాస్తు చేసుకోవాలని ఎంపీడీవో లవరాజు ఒక ప్రకటనలో కోరారు. టెంట్లు వేసే ప్రదేశంలో మరుగుదొడ్లు, ప్రహరీ, కంచె, తాగునీరు వంటి సౌకర్యాలు ఉండాలని సూచించారు. అంతేకాకుండా పోలీసు, విద్యుత్, రెవెన్యూ శాఖల నుంచి అవసరమైన అనుమతులు ఉండాలన్నారు. అధికారులు నిర్ణయించిన రుసుం చెల్లించాలని సూచించారు. టెంట్లు కేటాయించేటప్పుడు పర్యాటకుల ఆధార్ కార్డుల వివరాలను నమోదు చేయాలన్నారు. నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

ఉచిత గ్యాస్ పంపిణీ



ఉచిత గ్యాస్‌ను పంపిణీ చేస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి,పాడేరు/రంపచోడవరం: జిల్లాలో ఉచిత గ్యాస్ పంపిణీని శుక్రవారం కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ ప్రారంభించారు. స్థానిక కాఫీ అతిథి గృహంలో జరిగిన ఈ కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ఈ పథకానికి 1,46,508 మంది అర్హులన్నారు. రంపచోడవరం మండల పరిషత్ కార్యాలయ ప్రాంగణంలో ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం, ఎమ్మెల్యే మిరియాల శిరీషాదేవి గ్యాస్ సిలిండర్లను అందజేశారు.

17 కిలోల గంజాయి పట్టివేత

- ముగ్గురి అరెస్టు



గంజాయి నిందితులతో పోలీసులు

హుకుంపేట: గంజాయి తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించినట్టు ఎస్‌ఐ సురేష్ తెలిపారు. మండలంలోని ఆంధ్రా–ఒడిశా సరిహద్దు పాములాయి జంక్షన్‌లో గురువారం రవాణాకు గంజాయి సిద్ధంగా ఉన్నట్టు అందిన సమాచారం మేరకు తనిఖీలు నిర్వహించామని చెప్పారు. స్కూటీపై తరలించేందుకు సిద్ధంగా ఉంచిన రెండు బస్తాల (17 కిలోలు) గంజాయిని స్వాధీనం చేసుకున్నామని ఆయన తెలిపారు. ఈ వ్యవహారంతో ప్రమేయమున్న పెదబయలు, డుంబ్రిగుడ మండలానికి చెందిన ఇద్దరు, అనకాపల్లి జిల్లా దేవరాపల్లి మండలానికి చెందిన ఒకరిని అదుపులోకి తీసుకున్నామని చెప్పారు. మరో ఇద్దరు పరారీలో ఉన్నట్టు ఎస్‌ఐ తెలిపారు.

పేకాట శిబిరంపై దాడి

- ఏడుగురి అరెస్టు
- రూ.73,900, రెండు కార్లు, సెల్‌ఫోన్ల స్వాధీనం

కొయ్యూరు: మండలంలోని కినపర్తి పంచాయతీ బీమవరంలో పేకాట శిబిరంపై దాడి చేసి ఏడుగురిని అరెస్టు చేసినట్టు సీఐ వెంకటరమణ శుక్రవారం తెలిపారు. ముందస్తు సమాచారం మేరకు మంప ఎస్‌ఐ శంకర్‌రావుతో కలిసి శిబిరంపై దాడి చేసినట్టు ఆయన పేర్కొన్నారు. నిందితుల నుంచి రూ.73,900, ఏడు సెల్‌ఫోన్లు, రెండు కార్లు స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేశామని తెలిపారు. చట్టవ్యతిరేక కార్యక్రమాలకు పాల్పడితే చర్యలు తప్పవని ఆయన హెచ్చరించారు.

పండుటాకుల ప్రయాస

పింఛను లబ్ధిదారులకు కూటమి ప్రభుత్వం చుక్కలు చూపిస్తోంది. గత ప్రభుత్వం నేరుగా ఇంటివద్దకే అందజేయగా ప్రస్తుత ప్రభుత్వంలో సిబ్బంది పింఛనుదారులందరినీ ఒకేచోటకు రప్పిస్తున్నారు. వీరు ఎప్పుడు వస్తారో తెలియక రోజంతా పడిగాపులు పడాల్సి వస్తోందని పండుటాకులు వాపోతున్నారు.

ప్రచారానికే పరిమితమైన ఇంటి వద్దకు పింఛను పంపిణీ

- పంచాయతీల పరిధిలో ఒకే చోటకు రప్పించి అందజేస్తున్న సిబ్బంది
- వారి రాకకోసం ఎదురుచూపులు
- గంటల తరబడి వేచి ఉండాల్సిన దుస్థితి



జి.మాడుగుల మండలం సొలెకు సచివాలయం వద్ద పింఛను కోసం నిరీక్షిస్తున్న లబ్ధిదారులు

సాక్షి, పాడేరు: పింఛను పొందేందుకు పండుటాకులకు ప్రయాస తప్పడం లేదు. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో సామాజిక పింఛన్‌దారులకు ప్రతీనెల ఒకటో తేదీ ఉదయాన్నే గ్రామ సచివాలయ సిబ్బంది, వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అందజేసేవారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి సమస్య మొదలైంది. ఇంటింటికీ వెళ్లి పింఛను సొమ్ము అందజేస్తున్నట్టు అధికారులు చెబుతున్నా క్షేత్రస్థాయిలో పరిస్థితి ఇందుకు భిన్నంగా ఉంది. గ్రామానికి వెళ్లిన సిబ్బంది అందరినీ ఒకే చోటకు రప్పించి అందజేస్తున్నారు. వారు వచ్చే వరకు పింఛనుదారులు వేచి ఉండాల్సి వస్తోంది శివారు ప్రాంతాల లబ్ధిదారుల పరిస్థితి మరింత దయనీయంగా ఉంది. ఐదు నుంచి ఆరు కిలోమీటర్ల దూరంలోని గ్రామసచివాలయాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతున్నారు. ఇలా తమకు ప్రతి నెలా ఇబ్బందులు తప్పడం లేదని వారు వాపోతున్నారు. పింఛన్లు ఇచ్చే సిబ్బంది కోసం శుక్రవారం గ్రామ సచివాలయాలు, పంచాయతీ కార్యాలయాలు, ప్రధాన జంక్షన్లు, రోడ్ల వెంబడి గంటల తరబడి వేచి ఉండాల్సి వచ్చింది. దీంతో వారు నరకయాతన పడ్డారు.

సర్వర్ మొరాయింపుతో..

- సర్వర్ పనిచేయకపోవడంతో పాడేరు మండలం వనుగుపల్లి పంచాయతీ బంగారుమెట్టలో సాయంత్రం వరకు పింఛనుదారులు వేచి ఉండాల్సి వచ్చింది. ఇదే మండలం కాడెలి సచివాలయం పరిధిలో మధ్యాహ్నం రెండు గంటల వరకు సర్వర్ మొరాయించడంతో పింఛను పంపిణీలో జాప్యం జరిగింది. ఇదే పరిస్థితి జిల్లావ్యాప్తంగా నెలకొనడంతో పింఛనుదారులు ఇబ్బందులు పడ్డారు. దీంతోపాటు వేలిముద్రలు పడకపోవడంతో సాంకేతికపరమైన సమస్యలు తలెత్తాయి.

తగ్గుతున్న పింఛన్లు

జిల్లాలో పెరగాల్సిన పింఛనుదారుల సంఖ్య ప్రతినెలా తగ్గుతోంది. ప్రస్తుత నెలకు సంబంధించి 424 తగ్గాయి. మృతుల పేర్లను తొలగించడం వల్లే సంఖ్య తగ్గుతుందని డీఆర్‌డీఏ అధికారులు చెబుతున్నా వాటి వివరాలను వెల్లడించడం లేదు. గత నెలలో 1,24,778 మందికి పింఛను మంజూరు కాగా నవంబర్‌కు సంబంధించి 1,24,354కి తగ్గిపోయింది. గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వ హయాంలో ప్రతి నెలా పింఛన్‌దారుల సంఖ్య పెరగ్గా, కూటమి ప్రభుత్వంలో తగ్గడం గమనించదగ్గ విషయం.

1,16,137 మందికి పింఛన్ల పంపిణీ

జిల్లాలోని 22 మండలాల పరిధిలో శుక్రవారం రాత్రి 8 గంటల వరకు 93.39 శాతం మేర పింఛన్ల పంపిణీ జరిగిందని కలెక్టర్ ఏఎస్ దినేష్‌కుమార్ తెలిపారు. లగిశపల్లిలో ఆయన లబ్ధిదారుకు అందజేశారు. తొలిరోజు 1,16,137మందికి సిబ్బంది అందజేశారని ఆయన పేర్కొన్నారు. మిగతా వారికి మరుసటి రోజు అందజేస్తారని ఆయన తెలిపారు.

ప్రతి నెలా ఇబ్బందే



గత ప్రభుత్వంలో ఇంటింటికి వచ్చి పింఛను ఇచ్చేవారు. చంద్రబాబు సీఎం అయిన నాటి నుంచి ప్రతి నెలా ఒకటో తేదీన ఇంటివద్దకు పింఛను సొమ్ము అందడం లేదు. ఈ నెల పింఛను పొందేందుకు కొక్కిరాపల్లిలోని టైలర్ దుకాణం వద్ద నిరీక్షించాల్సి వచ్చింది.

– కోట అప్పన్న, పింఛను లబ్ధిదారుడు, కొక్కిరాపల్లి, జి.మాడుగుల మండలం

గిరిజనులకు అన్యాయం చేస్తే సహించం



సారుబయలులో గిరిజనులతో మాట్లాడుతున్న పాడేరు ఎమ్మెల్యే విశ్వేశ్వరరాజు

జి.మాడుగుల: గిరిజనులకు ప్రభుత్వ ఇళ్ల నిర్మాణాల్లో అటవీశాఖ అడ్డంకులు సృష్టించి అన్యాయం చేస్తే సహించేది లేదని పాడేరు ఎమ్మెల్యే, వైఎస్సార్‌సీపీ జిల్లా అధ్యక్షుడు మత్స్యరాస విశ్వేశ్వరరాజు హెచ్చరించారు. మండలంలోని సొలభం పంచాయతీ సారుబయలు ఆదివాసీ గ్రామంలో శుక్రవారం ఆయన పర్యటించారు. గ్రామంలో ప్రజల ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకున్నారు. గత 50 ఏళ్లుగా ఇదే గ్రామంలో 20 కుటుంబాల వారం నివసిస్తున్నామని అయితే ప్రభుత్వం మంజూరు చేసిన 12 ఇళ్లను నిర్మించుకునేందుకు అటవీశాఖ అధికారులు, సిబ్బంది అనుమతి ఇవ్వడం లేదని ఎమ్మెల్యే దృష్టికి గిరిజనులు తీసుకువచ్చారు. గ్రామంలో 25 మంది విద్యార్థులు ఉన్నా పాఠశాల భవనం లేదని, ఉపాధ్యాయుడిని నియమించ లేదని వారు వివరించారు. దీనిపై స్పందించిన ఎమ్మెల్యే మాట్లాడుతూ సమస్యను ఉన్నతాధికారుల దృష్టికి తీసుకువెళ్లి గృహ నిర్మాణాలకు అనుమతి వచ్చేలా కృషి చేస్తానన్నారు. పాఠశాల భవనం మంజూరుతోపాటు భాషా వలంటీర్ నియమకానికి ప్రయత్నిస్తానని హామీ ఇచ్చారు. వైఎస్సార్‌సీపీ మండల అధ్యక్షుడు సుర్మని మత్స్యకొండంనాయుడు, సర్పంచ్‌ల ఫోరం మండల అధ్యక్షుడు సురభంగి రామకృష్ణ, సర్పంచ్‌లు ఐసరం హనుమంతరావు, కిముడు రాంబాబు, ఎంపీటీసీ గబ్బాడి సన్యాసిదొర పాల్గొన్నారు.

కార్తీక తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సు సర్వీసులు

గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ రామన్నదొర



కరపత్రాలను పంపిణీ చేస్తున్న ఆర్టీసీ సిబ్బంది

గంగవరం : కార్తీక మాసం సందర్భంగా ఏజెన్సీ ప్రాంత ప్రజల సౌకర్యం కోసం నెలరోజులపాటు కార్తీకమాస తీర్థయాత్రలకు ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతున్నట్లు గోకవరం ఆర్టీసీ డిపో మేనేజర్ రామన్నదొర తెలిపారు. ఇందుకు సంబంధించిన వివరాలను శుక్రవారం ఆయన తెలిపారు. పంచారామ క్షేత్ర దర్శనానికి (అమరావతి, భీమవరం, పాలకొల్లు, ద్రాక్షారామం, సామర్లకోట) టికెట్ ధర రూ. 960, కృష్ణాతీర క్షేత్ర దర్శనానికి (వేదాద్రి, ముత్యాల, తిరుమల గిరి, నెమలి, జమలాపురం) రూ.వెయ్యి, కోనసీమ క్షేత్ర (అయినవిల్లి, మురమళ్ల, కుండలేశ్వరం, అప్పనపల్లి, అంతర్వేది) దర్శనానినికి రూ.500 ధర చెల్లించాల్సి ఉంటుందన్నారు. శ్రీశైల శిఖర దర్శనం (మహానంది, శ్రీశైలం , కోటప్పకొండ, విజయవాడ) రూ. 1800, ఉత్తరాంధ్ర క్షేత్ర దర్శనం శ్రీకూర్మం, అరసవిల్లి, శ్రీముఖలింగం, విజయనగరం-రామనారాయణ గుడి, సింహాచలం, అన్నవరం) దర్శనానికి రూ.వెయ్యి, తెలంగాణలోని వేములవాడ, కాళేశ్వరం, రామప్పగుడి, వేయి స్తంభాలగుడి, పాలకుర్తి) దర్శనానికి రూ.1800, అరుణాచల దర్శనానికి (అరుణాచలం, శివకంచి, విష్ణుకంచి, శ్రీకాళహస్తి, విజయవాడ,) రూ 3200 , సీతారామ క్షేత్రం (భద్రాచలం, శ్రీరామగిరి, భద్రాచలం, దుమ్ముగూడెం, పర్ణశాల) దర్శనానికి రూ.550 చొప్పున టికెట్ ధర నిర్ణయించినట్లు ఆయన తెలిపారు. ఈ ఎనిమిది క్షేత్రాలకు గోకవరం నుంచి ప్రతీ ఆదివారం ప్రత్యేక బస్సు సర్వీసులు నడుపుతామన్నారు. ఈ మేరకు కరపత్రాల ద్వారా ప్రచారం చేస్తున్నట్టు ఆయన వివవరించారు. దీనిలో భాగంగా శుక్రవారం గంగవరంలో ఆర్టీసీ సిబ్బంది కుమార్, మురళీ కరపత్రాలు పంపిణీ చేశారు.

పలు రైళ్లకు అదనపు కోచ్‌లు

తాటిచెట్లపాలెం(విశాఖ): ప్రయాణికుల రద్దీ దృష్ట్యా పలు రైళ్లకు తాత్కాలికంగా అదనపు కోచ్‌లను జత చేస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–చెన్నై ఎగ్మోర్ (08557) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 2, 9, 16, 23, 30వ తేదీల్లో, చెన్నై ఎగ్మోర్ –విశాఖపట్నం (08558) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 3, 10, 17, 24, డిసెంబరు 1వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు.

- విశాఖపట్నం–కొల్లాం (08539) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 6, 13, 20, 27వ తేదీల్లో, కొల్లాం –విశాఖపట్నం(08540) స్పెషల్ ఎక్స్‌ప్రెస్‌కు ఈ నెల 7, 14, 21, 28వ తేదీల్లో ఒక థర్డ్ ఏసీ ఎకానమీ, ఒక స్లీపర్ క్లాస్ కోచ్‌లను జత చేస్తున్నారు.

జనసాధారణ్ స్పెషల్ రైళ్లు

ప్రయాణికుల రద్దీ దృష్ట్యా విశాఖపట్నం–విజయవాడ–విశాఖపట్నం మధ్య జనసాధారణ్ స్పెషల్ రైళ్లు నడుపుతున్నట్లు వాల్తేర్ డివిజన్, సీనియర్ డివిజనల్ కమర్షియల్ మేనేజర్ కె.సందీప్ తెలిపారు. విశాఖపట్నం–విజయవాడ(08567) జనసాధారణ్ స్పెషల్ విశాఖలో ఈ నెల 1, 3, 4, 6, 8, 10, 11, 13వ తేదీలలో ఉదయం 10గంటలకు బయల్దేరి అదే రోజు మధ్యాహ్నం 4 గంటలకు విజయవాడ చేరుకుంటుంది. తిరుగు ప్రయాణంలో విజయవాడ–విశాఖపట్నం(08568) జనసాధారణ్ స్పెషల్ విజయవాడలో ఆయా రోజులలో సాయంత్రం 6.30 గంటలకు బయల్దేరి మధ్యరాత్రి 12.35 గంటలకు విశాఖ చేరుకుంటాయి.

సీలేరు కాంప్లెక్సు ఎస్ఈ రామభద్రరాజు బదిలీ

- పోలవరం జలవిద్యుత్ కేంద్రం ఎస్ఈగా నియామకం



సీలేరు: ఏపీ జెన్‌కో సీలేరు కాంప్లెక్స్ ఎస్ఈ రామభద్రరాజుకు బదిలీ అయింది. ఆయనను పోలవరం జలవిద్యుత్ కేంద్రం ఎస్ఈగా నియమిస్తూ ఆ సంస్థ ఎండీ కేవీఎస్ చక్రధరబాబు ఉత్తర్వులు జారీ చేశారు. సీలేరు పంప్డ్ స్టోరేజ్ ప్రాజెక్టు ఎస్ఈ బి.చంద్రశేఖర్‌రెడ్డికి సీలేరు కాంప్లెక్సు ఎస్ఈగా ఇన్‌చార్జి బాధ్యతలు అప్పగించినట్టు ఉత్తర్వుల్లో ఆయన పేర్కొన్నారు.

రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు గిరి విద్యార్థిని



నాజ్‌మిన్

ముంచంగిపుట్టు: స్థానిక ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికల పాఠశాల–2లో 9వ తరగతి చదువుతున్న కిరసాని నాజ్‌మిన్ రాష్ట్రస్థాయి షాట్‌పుట్ పోటీలకు ఎంపిక అయ్యింది. ఇటీవల విశాఖపట్నంలో నిర్వహించిన జిల్లా స్థాయి షాట్‌పుట్ పోటీలోఆమె ప్రతిభ కనబరిచింది. ద్వితీయ స్థానంలో నిలిచింది. దీంతో ఈ నెల 5వ తేదీన ఏలూరులో జరిగే రాష్ట్రస్థాయి పోటీలకు ఆమె అర్హత సాధించింది. ఈ సందర్భంగా ఆమెకు శిక్షణ ఇచ్చిన పీడీ అశోక్‌కుమారి, పీఈటీ నీలకంఠంను శుక్రవారం గిరిజన సంక్షేమ ఉపసంచాలకులు రజని, హెచ్‌ఎం ఎంవీఎస్ ప్రకాష్, ఉపాధ్యాయులు అభినందించారు. రాష్ట్రస్థాయిలో రాణించి, గిరిజన ప్రాంతానికి గుర్తింపు తేవాలని వారు ఆకాంక్షించారు.

జిల్లాలో తేలికపాటి వర్షాలు

- ఐదు ఎంఎం వరకు వర్షపాతం నమోదయ్యే అవకాశం
- చింతపల్లి ఆర్‌ఏఆర్‌ఎస్ ఏడీఆర్ అప్పలస్వామి వెల్లడి



మాట్లాడుతున్న ఏడీఆర్ అప్పలస్వామి

చింతపల్లి: జిల్లాలో రాగల ఐదు రోజుల్లో తేలికపాటి వర్షాలు కురుస్తాయని స్థానిక ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం అసిస్టెంట్ డైరెక్టర్ ఆఫ్ రిసెర్చ్ (ఏడీఆర్), వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పల స్వామి తెలిపారు. ఇందుకు సంబంధించి వాతావరణ సమాచారాన్ని శుక్రవారం శాస్త్రవేత్తలు వెల్లడించారు. జిల్లాలోని పాడేరు, అరకు, చింతపల్లి, రంపచోడవరం డివిజన్ల పరిధిలో కనిష్ఠంగా ఒక ఎంఎం, గరిష్ఠంగా ఐదు ఎంఎం వర్షపాతం నమోదవుతుందన్నారు. గాలిలో తేమ శాతం 85 నుంచి 90 ఉంటుందని ఏడీఆర్ పేర్కొన్నారు.

పండగ వేళ.. మృత్యుఘోష

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు.. వాగులో మునిగి మరొకరు మృతి

దీపావళి పండగ నాడు జరిగిన వేర్వేరు ప్రమాదాలు కొన్ని కుటుంబాల్లో విషాదం నింపాయి. ముగ్గురు మృతితో తీవ్ర శోకంలోకి నెట్టాయి. జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేస్తున్న మధ్యప్రదేశ్‌కు చెందిన ఇద్దరు వ్యక్తులు దీపావళి సరుకులు తెచ్చుకునేందుకు బయలుదేరారు. మార్గం మధ్యలో జరిగిన రోడ్డు ప్రమాదంలో వారు ప్రాణాలు కోల్పోయారు. విహారయాత్రకు అన్నదమ్ములు, స్నేహితుడితో మారేడుమిల్లి ప్రాంతానికి వచ్చిన సాఫ్ట్‌వేర్ ఉద్యోగి సోకిలేరు వాగులో మునిగి ప్రాణాలు కోల్పోయాడు. రాజవొమ్మంగి మండలంలో జరిగిన ఘటనలో చీరకు దీపం కొన అంటుకోవడంతో తీవ్రంగా గాయపడిన ఓ మహిళ చావు బతుకుల మధ్య కొట్టుమిట్టాడుతోంది.

పొట్టకూటి కోసం వచ్చి..



బాదల్ జాదవ్ మృతదేహం



ప్రమాదానికి కారణమైన వ్యాన్

చింతపల్లి: పొట్టకూటికోసం వేరే రాష్ట్రం నుంచి వలసవచ్చిన ఇరువురుని రోడ్డు ప్రమాద రూపంలో మృత్యువు కబళించింది. వారిపై ఆధారపడిన కుటుంబాలకు పోషించే దిక్కును లేకుండా చేసింది. ఈ హృదయ విదారక ఘటన వివరాలిలా ఉన్నాయి. నర్సీపట్నం నుంచి లంబసింగి వారపు సంతకు గురువారం ఉదయం కాయగూరల లోడుతో వ్యాన్ బయలు దేరింది. అదే మార్గంలో బాదల్ జాదవ్(22), మౌళ్ జాదల్ (30) సరుకులకోసం లోతుగెడ్డ జంక్షన్ నుంచి బైక్‌పై నర్సీపట్నం బయలుదేరారు. ఎదురెదురుగా వస్తున్న ఈ రెండు వాహనాలు ఘాట్ మార్గంలో ఢీకొన్నాయి. ఈ ఘటనలో బైక్‌పై వస్తున్న బాదల్ జాదవ్ సంఘటన స్థలంలో మృతి చెందాడు. తీవ్రంగా గాయపడిన మౌళ్ జాదల్ ఆస్పత్రికి తరలిస్తుండగా మార్గంమధ్యలో చనిపోయినట్టు పోలీసులు తెలిపారు. వ్యాన్‌ను సీజ్ చేసి డ్రైవర్‌ను అరెస్టు చేసి కేసు దర్యాప్తు చేస్తున్నట్టు ఎస్‌ఐ వెంకటేశ్వరరావు తెలిపారు.

మధ్యప్రదేశ్ నుంచి వలస వచ్చి..

మధ్యప్రదేశ్‌కు చెందిన బాదల్ జాదవ్, మౌళ్ జాదల్ ఇక్కడి జాతీయ రహదారి నిర్మాణ పనుల్లో కూలీలుగా పనిచేస్తూ కుటుంబాలను పోషించుకుంటున్నారు. వీరంతా లోతుగెడ్డ జంక్షన్‌లో నివాసం ఉంటూ ప్రతిరోజూ పనులు జరిగే ప్రాంతానికి వెళ్లి వస్తుంటారు. దీపావళి పండగ కావడంతో జాతీయ రహదారి పనులు జరగలేదు. దీంతో పండగ సరుకులు కొనుక్కునేందుకు ఇద్దరు సమీప నర్సీపట్నం పట్టణానికి బైక్‌పై బయలు దేరారు. ఊహించని పరిస్థితుల్లో ప్రమాదానికి గురయ్యారు. వ్యాన్ రూపంలో వారిద్దరిని మృత్యువు కబళించడంతో ఆయా కుటుంబాలు యజమానులను కోల్పోయాయి. బాదల్ జాదవ్‌కు భార్య, మౌళి జాదవ్‌కు భార్య, ఇద్దరు పిల్లలు ఉన్నారు. ప్రమాద సమాచారం తెలుసుకున్న వారు సంఘటన స్థలానికి వచ్చారు. గుండెలవిలసేలా రోదించారు.

విషాదంగా విహారయాత్ర



ఏరియా ఆస్పత్రిలో సాయికృష్ణ మృతదేహం

చింతూరు: వారంతా అన్నదమ్ముల పిల్లలు.. వరసకు అన్నదమ్ములు.. ఎంతో సంతోషంతో స్నేహితుడితో కలిసి విహారయాత్రకు వచ్చారు. సోకిలేరు వాగులో దిగి స్నానాలు చేస్తున్నారు. ఊహించని పరిస్థితుల్లో వీరిలో ఒక యువకుడు ప్రమాదవశాత్తూ మునిగి ప్రాణాలు కోల్పోయాడు. పండగ పూట జరిగిన ఈ ప్రమాదం తల్లిదండ్రులకు కడుపుకోత మిగిల్చింది. శుక్రవారం జరిగిన ఈ ఘటన వివరాలిలా ఉన్నాయి. ప్రకాశం జిల్లా కాకుటూరివారిపాలెంకు చెందిన అన్నదమ్ముల పిల్లలైన అమినిగడ్డ సాయికృష్ణ (29), నాగసాయి, నాగార్జున, రవీంద్ర, వారి స్నేహితుడు వంశీ హైదరాబాద్‌లో సాఫ్ట్‌వేర్ ఉద్యోగులుగా పనిచేస్తున్నారు. దీపావళి సెలవులు కావడంతో వీరంతా మూడు ద్విచక్ర వాహనాలపై ఏజెన్సీ అందాలు తిలకించేందుకు గురువారం హైదరాబాద్ నుంచి మారేడుమిల్లి బయలుదేరారు. శుక్రవారం ఉదయం భద్రాచలం వచ్చిన వారు రాముడిని దర్శించుకున్నారు. అనంతరం మారేడుమిల్లి బయలుదేరారు. ఘాట్‌రోడ్‌లో చింతూరు మండలం తులసిపాక సమీపంలోని వ్యూపాయింట్ వద్ద ఆగారు. అక్కడ సాయికృష్ణ, నాగసాయి, నాగార్జున సోకిలేరు వాగులోకి దిగారు. వీరు స్నానం చేస్తుండగా ప్రమాదవశాత్తూ సాయికృష్ణ నీటిలో మునిగిపోయాడు. మిగతా ఇద్దరు భయపడి ఒడ్డుపైకి వచ్చేశారు. దీనిని గమనించిన స్థానికులు మునిగిపోయిన సాయికృష్ణను రక్షించేందుకు ప్రయత్నించారు. వారు బయటకు తీసేలోపే సాయికృష్ణ మృతి చెందాడు. వెంటనే మృతదేహాన్ని బయటకు తీశారు. అక్కడి నుంచి చింతూరు ఏరియా ఆస్పత్రికి తరలించారు. ఎంతో సంతోషంగా విహారయాత్రకు వచ్చామని కళ్లెదుటే తమ సోదరుడిని సోకిలేరు వాగు పొట్టనపెట్టుకోవడం ఎంతో బాధగా ఉందని సాయికృష్ణ సోదరులు విలపించారు. మోతుగూడెం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

దీపం అంటుకుని..



ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న సరస్వతి

రాజవొమ్మంగి: మండలంలోని వాతంగిలో దీపావళి పండగ రోజున అపశృతి చోటుచేసుకుంది. ఇంటి ముంగిట వెలిగించిన నూనె దీపం చీర కొంగుకు అంటుకోవడంతో ఓ మహిళ తీవ్ర గాయాల పాలయ్యింది. కుటుంబసభ్యుల కథనం మేరకు వివరాలిలా ఉన్నాయి. వాతంగిలో దంపతులు సరస్వతి, ఈశ్వర్రావు ఇంటి వద్దనే చిన్న దుకాణం నిర్వహిస్తున్నారు. పండగ సందర్భంగా సరస్వతి గురువారం రాత్రి దీపాలు వెలిగించి ఇంటి ముందు, దుకాణం వద్ద వరుసగా ఏర్పాటు చేసింది. ఇంతలో దీపం కొన ఆమె చీరకు అంటుకుంది. అక్కడే సీసాతో ఉన్న పెట్రోల్‌కు మంటలు సోకడంతో ఇల్లంతా వ్యాపించాయి. దీంతో మంటల్లో చిక్కుకున్న ఆమెను భర్త బయటకు తీసుకువచ్చాడు. తీవ్రంగా గాయపడిన ఆమెను ఏలేశ్వరం సీహెచ్‌సీకి తరలించారు. అక్కడి నుంచి కాకినాడలోని ఓ ప్రైవేట్ ఆస్పత్రికి తరలించారు. సుమారు 60 శాతం మేర కాలిపోవడంతో ఆమె పరిస్థితి విషమంగా ఉన్నట్టు వైద్యులు తెలిపారని కుమార్తె అనిత తెలిపింది. ప్రమాద సమాచారం తెలుసుకున్న సీఐ సన్యాసినాయుడు, జడ్డంగి ఎస్‌ఐ చిన్నబాబు శుక్రవారం సంఘటన స్థలానికి వెళ్లారు. వివరాలు సేకరించారు. దుకాణంలో ఎగసిన మంటల వల్ల కాలిపోయిన సరుకులు, వస్తువుల విలువ రూ.2 లక్షలు ఉంటుందని అధికారులు అంచనా వేస్తున్నారు. వీఆర్వో చదల వెంకటరెడ్డి పాల్గొన్నారు.

సింహగిరిపై విశేషంగా నృసింహ హోమం



పూర్ణాహుతి నిర్వహిస్తున్న అర్చకులు



ప్రధాన కలశాన్ని, శిరస్సుపై పెట్టుకుని ప్రదక్షిణ చేస్తున్న అర్చకుడు

సింహాచలం: శ్రీ వరాహ లక్ష్మీనృసింహస్వామి జన్మనక్షత్రం స్వాతి నక్షత్రాన్ని పురస్కరించుకుని శుక్రవారం సింహగిరిపై నృసింహ హోమం విశేషంగా జరిగింది. ఉదయం 7 గంటల నుంచి ఆలయ కల్యాణమండపంలో అర్చకులు హోమాన్ని శాస్త్రోక్తంగా నిర్వహించారు. వేదికపై చక్రపెరుమాళ్లని కొలువుంచి విష్వక్సేనపూజ, పుణ్యాహవచనం, షోడశోపచారపూజలు నిర్వహించారు. పూజలో పాల్గొన్న భక్తులకు కంకణధారణ చేసి హోమగుండం వద్ద కూర్చోబెట్టారు. మండపారాధన, అగ్నిప్రతిష్ఠ, హోమం, పూర్ణాహుతి కార్యక్రమాలను వైభవంగా నిర్వహించారు. కుంభప్రోక్షణను శాస్త్రోక్తంగా జరిపారు. ఉభయదాతలకు స్వామివారి శేషవస్త్రాలు, ప్రసాదం అందించారు. స్థానాచార్యులు టి.పి. రాజగోపాల్, అర్చకులు చక్రవర్తి తదితరులు కార్యక్రమాన్ని నిర్వహించారు.

క్లుప్తంగా

అమరవీరుల ఆశయ సాధనకు కృషి


అమరవీరుల స్తూపం వద్ద నివాళులర్పిస్తున్న నాయకులు

రంపచోడవరం: జాతీయ, రాష్ట్ర, జిల్లా, గ్రామ స్థాయిలో నిర్వహించిన ప్రజా ఉద్యమాల్లో అమరులైన వారి ఆశయ సాధనకు అందరూ కృషి చేయాలని సీపీఐ ఎంఎల్ న్యూడెమోక్రసీ జిల్లా నాయకులు చిట్టిబాబు దూలన్న, బాల్ రెడ్డి, బాల్ దొర, లచ్చిరెడ్డి, పీఓడబ్ల్యూ జిల్లా కార్యదర్శి అనసూయ, అరుణోదయ రాష్ట్ర కార్యదర్శి భీమశంకరం అన్నారు. సీపీఐ (ఎంఎల్) న్యూ డెమోక్రసీ పార్టీ ఆధ్వర్యంలో వేములకొండ, కాకవాడ , ఆనంపల్లి గ్రామాల్లో జరిగిన కార్యక్రమాల్లో అమరవీరులకు నివాళులర్పించారు. ధర్మారెడ్డి, గోవిందు, మంగయ్య, చిన్నాలమ్మ, వెంకటలక్ష్మి, విజయకుమారి, రాములమ్మ తదితరులు పాల్గొన్నారు.

అధ్వాన రహదారితో అవస్థలు


అధ్వాన రహదారిపై నిరసన తెలుపుతున్న గ్రామస్తులు

సీలేరు: గూడెంకొత్తవీధి మండలం ఆర్.వి.నగర్ నుంచి సీలేరు మీదుగా పాలగెడ్డ వరకు రహదారి గోతులతో నిండి అధ్వానంగా ఉందని, రాకపోకలకు ఇబ్బందులు పడుతున్నామని స్థానికులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ మేరకు సమస్యను ముఖ్యమంత్రి, ఆర్‌అండ్‌బీ శాఖ మంత్రి, కలెక్టర్, రంపచోడవరం, పాడేరు ఎమ్మెల్యేల దృష్టికి తీసుకెళ్లినట్టు పలువురు చెప్పారు. భారీ వర్షం పడితే ఈ మార్గంలో రాకపోకలు నిలిచిపోయే ప్రమాదం ఉందని వినతిలో పేర్కొన్నట్టు చెప్పారు. రహదారి నిర్మాణానికి నిధులు కేటాయించాలని వారు కోరారు. సర్పంచ్‌లు సంధ్యారాణి, దుర్గో, నాయకులు శ్రీనివాసు, గుర్రప్ప, బాలు పాల్గొన్నారు.

పోలీసు అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయం


చింతపల్లిలో కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహిస్తున్న పోలీసులు


జి.మాడుగులలో కొవ్వొత్తులతో మానవహారాన్ని నిర్వహిస్తున్న విద్యార్థులు, పోలీసులు

జి.మాడుగుల: శాంతిభద్రతలు పరిరక్షణలోను, విధి నిర్వహణలో పోలీస్ అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్ఐ షణ్ముఖరావు అన్నారు. పోలీసు అమరవీరుల వారోత్సవాల్లో భాగంగా విద్యార్థులకు వకృత్వ, వ్యాసరచన, ఆటల పోటీలు నిర్వహించి, విజేతలకు బహుమతులు అందజేశారు. అమరవీరుల ఆత్మకు శాంతి కలగాలని విద్యార్థులు, గ్రామస్తులతో కలిసి పోలీసులు భారీ కొవ్వొత్తులతో ర్యాలీ నిర్వహించి, మూడు రోడ్ల జంక్షన్ వద్ద మానవహారం చేశారు.

ముంచంగిపుట్టు: పోలీసు అమరవీరుల వారోత్సవాలు పురస్కరించుకొని మండల కేంద్రంలో ఎస్ఐ రవీంద్ర ఆధ్వర్యంలో కొవ్వొత్తులతో శాంతి ర్యాలీ నిర్వహించారు. అమరులైన పోలీసులకు నివాళులర్పించారు. ఈ సందర్భంగా ఎస్ఐ రవీంద్ర మాట్లాడుతూ శాంతి భద్రతల పరిరక్షణే లక్ష్యంగా పోలీసులు పనిచేస్తున్నారని, ప్రజల సహకారం నిత్యం పోలీసులకు ఉండాలని ఆయన కోరారు. విధి నిర్వహణలో ప్రాణాలు కోల్పోయిన పోలీసుల త్యాగాలు మరువలేనివన్నారు.

గూడెంకొత్తవీధి: పోలీసు అమరవీరుల వారోత్సవాలను పురస్కరించుకుని విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీ చేశారు. ఎస్ఐ అప్పలసూరి, సిబ్బంది పాల్గొన్నారు.

చింతపల్లి: పోలీసుల అమరవీరుల త్యాగాలు చిరస్మరణీయమని ఎస్ఐ వెంకటేశ్వరరావు అన్నారు. అమరవీరుల సంస్మరణ వారోత్సవాల్లో భాగంగా మండల కేంద్రంలో శుక్రవారం కొవ్వొత్తుల ర్యాలీ నిర్వహించారు. పాత బస్‌స్టాండ్ నుంచి హనుమాన్ జంక్షన్ వరకు ర్యాలీ సాగింది. ఈ సందర్భంగా ఎస్ఐ వెంకటేశ్వరరావు మాట్లాడుతూ విధి నిర్వాహణలో అమరులైన పోలీసుల ఆశయ సాధనకు సిబ్బంది కృషి చేయాలన్నారు.

గంగవరం : పోలీసు అమరవీరుల వారోత్సవాలు సందర్భంగా ఎస్ఐ డి.భూషణం ఆధ్వర్యంలో పోలీసు అమరవీరులను స్మరిస్తూ సిబ్బంది, యువకులు, విద్యార్థులు కొవ్వొత్తులతో ర్యాలీని నిర్వహించారు. అమరవీరులకు నివాళులర్పించారు.


ముంచంగిపుట్టులో కొవ్వొత్తులతో ర్యాలీ చేస్తున్న పోలీసులు


గంగవరంలో ర్యాలీ నిర్వహిస్తున్న ఎస్ఐ భూషణం, సిబ్బంది


జీకే వీధిలో కొవ్వొత్తులతో విద్యార్థుల మానవహారం

క్రమశిక్షణతో చదివితే ఉత్తమ ఫలితాలు

ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం


ఆశ్రమ బాలికోన్నత పాఠశాలలో విద్యార్థినులతో మాట్లాడుతున్న పీవో సింహాచలం

గంగవరం : కమశిక్షణతో చదివితే మంచి ఫలితాలు పొందవచ్చని రంపచోడవరం ఐటీడీఏ పీవో కట్టా సింహాచలం అన్నారు. స్థానిక గిరిజన సంక్షేమ ఆశ్రమ బాలికోన్నత పాఠశాలను ఆయన శుక్రవారం ఆకస్మికంగా సందర్శించారు. రికార్డులు తనిఖీ చేశారు. విద్యార్థినులతో ఆయన మాట్లాడారు. ఆశ్రమ పాఠశాల, వసతి గృహంలో అందుతున్న సౌకర్యాలు, భోజన వసతి తదితర సదుపాయాలపై విద్యార్థులను అడిగి తెలుసుకున్నారు. మెనూ అమలు, పాఠాల బోధనపై ఆరా తీశారు. గిరిజన బాలబాలికలకు ఎన్నో అవకాశాలు ఉన్నాయని వాటిని సద్వినియోగం చేసుకొని ఉన్నత శిఖరాలకు చేరుకోవాలన్నారు. పలు సబ్జెక్టులపై ప్రశ్నలు వేసి, విద్యార్థులు చెప్పిన సమాధానాలకు ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. వసతి గృహంలోని మరుగుదొడ్లు, వంటశాలను పరిశీలించారు. పరిసరాలు పరిశుభ్రంగా ఉంచాలని సిబ్బందిని సూచించారు. ఆశ్రమ పాఠశాలలో సమస్యలను డిప్యూటీ వార్డెన్ లావణ్యను ఆయన అడిగి తెలుసుకున్నారు. ఇంకుడుగుంతలు నిర్మించాలని ఎంపీడీవో పిజీ రామకృష్ణ, ఏపీఓ ప్రకాశ్‌ను పీఓ ఆదేశించారు.

కార్తీక పూజలకు ఆలయాలు సిద్ధం


సీలేరులోని శివాలయంలో ఆకాశదీపం వెలిగిస్తున్న భక్తులు

సీలేరు/కొయ్యూరు: కార్తీకమాస పూజలకు ఆలయాలన్నీ ముస్తాబయ్యాయి. శివాలయాల్లో ప్రత్యేక పూజలకు ఏర్పాట్లు చేశారు. భక్తిశ్రద్ధలతో కార్తీక మాస పూజలకు భక్తులు సన్నద్ధమయ్యారు. సీలేరులోని శివాలయంలో శుక్రవారం సాయంత్రం ఆకాశదీపం వెలిగించారు. కార్తీక మాసం మొదటి సోమవారం అభిషేక పూజలు, నాగులచవితి నాడు సుబ్రహ్మణ్య పూజలు, మూడవ సోమవారం నాడు మహన్యాస రుద్రాభిషేకం, 19న సంకటహర చతుర్థి వంటి కార్యక్రమాలు జరుగుతాయని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. మారెమ్మతల్లి ఆలయంలో పూజలకు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కొయ్యూరు మండల కేంద్రంలోని భ్రమరాంబిక సమేత మల్లికార్జున స్వామి ఆలయంలో కార్తీక మాస పూజలకు ఏర్పాట్లు చేసినట్టు కమిటీ సభ్యులు తెలిపారు.

స్నేహితులే దొంగలు

- 4 తులాల బంగారం,
- 25 తులాల వెండి ఆభరణాల చోరీ

విశాఖ విద్య: స్నేహితులను ఇంటికి తీసుకెళ్తే.. వారు బంగారు ఆభరణాలతో ఉడాయించిన ఘటన గోపాలపట్నం పోలీస్‌స్టేషన్ పరిధిలో జరిగింది. వివరాలివీ.. సింహాచలం కాపుదిబ్బ ప్రాంతానికి చెందిన ఎస్.సత్యవతి తమ ఇంట్లోని బంగారు ఆభరణాలు కనిపించలేదని గత నెల 28న గోపాలపట్నం పోలీసులకు ఫిర్యాదు చేశారు. దీనిపై కేసు నమోదు చేసిన క్రైం సీఐ శ్రీనివాసరావు, ఎస్ఐ జి.తేజేశ్వరరావు చుట్టుపక్కల వారితోపాటు సత్యవతి కుటుంబ సభ్యుల నుంచి పూర్తిస్థాయిలో వివరాలను రాబట్టారు. బంగారు ఆభరణాలు కనిపించకుండా పోయిన ముందురోజు సత్యవతి కుమారుడి స్నేహితులిద్దరు ఆమె ఇంటికి వచ్చారు. కుమారుడి స్నేహితులు కావడంతో వారిని ఇంట్లో స్వేచ్ఛగా తిరగనిచ్చారు. అయితే ఆ ప్రబుద్ధులకు ఆమె ఇంట్లో బంగారు ఆభరణాలపై కన్నుపడింది. బీరువాలోని చైను, చెవుదిద్దులు, కాళ్ల పట్టీలు తదితర 25 తులాల వెండి ఆభరణాలు, నాలుగు తులాల బంగారు ఆభరణాలు దొంగలించారు. పోలీసుల దర్యాప్తులో ఈ విషయం వెలుగులోకి రావడంతో వారి నుంచి బంగారు ఆభరణాలను రికవరీ చేసి, బాధితులకు అప్పగించారు. చోరీకి పాల్పడిన వ్యక్తులిద్దరూ మైనర్లు కావడంతో వారిని జువైనల్ కోర్టులో హాజరుపరిచారు. సకాలంలో స్పందించి చోరీ కేసును ఛేదించిన క్రైం సీఐ, ఎస్ఐలను క్రైం డీసీపీ లతా మాధురి, ఏడీసీపీ మోహనరావు అభినందించారు.

అంతర్జాతీయ సదస్సుకు పరిశోధన పత్రాలు

విశాఖ సిటీ: గ్లోబ్ హీల్ 2025 అంతర్జాతీయ సదస్సుకు పరిశోధనా పత్రాలను ఆహ్వానిస్తున్నట్లు సదస్సు ప్రాంతీయ సమన్వయకర్త డాక్టర్ నిమాళి తక్షశిల ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సదస్సులో ఆంధ్ర విశ్వవిద్యాలయం కూడా భాగస్వామ్యం వహిస్తుందన్నారు. ఇందుకు సంబంధించిన అవగాహన ఒప్పందంపై ఏయూ రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావు సంతకాలు చేసినట్లు వెల్లడించారు. శ్రీలంకకు చెందిన ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ నాలెడ్జ్ మేనేజ్‌మెంట్ ఆధ్వర్యంలో ఏడు దేశాలకు చెందిన 13 విద్యా సంస్థల భాగస్వామ్యంతో ఫిబ్రవరి 20, 21 తేదీల్లో బ్యాంకాక్‌లోని అంబాసిడర్ హోటల్లో ఈ అంతర్జాతీయ సదస్సు జరగనున్నట్లు వివరించారు. ఈ సదస్సులో పరిశోధకులు, హెల్త్ కేర్ నిపుణులు తమ పరిశోధన పత్రాలను ఈ నెల 26వ తేదీలోగా తమకు సమర్పించాలని సూచించారు.

గంజాయి కేసులో 15 ఏళ్ల జైలు


ముద్దాయి గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్

తుమ్మపాల: మండలంలో తుమ్మపాల చినబాబు కాలనీ వద్ద 44 కేజీల గంజాయి రవాణా చేస్తూ పట్టుబడిన గోలారి మహేశ్వర్‌కు 10వ అదనపు జిల్లా కోర్టు 15 ఏళ్ల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా విధించినట్టు ఎస్పీ తుహిన్ సిన్హా ఒక ప్రకటనలో తెలిపారు. ఒడిశా రాష్ట్రం కోరాపుట్ జిల్లా నందన్‌పూర్ మండలం బాడంగ్ గ్రామానికి చెందిన గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్ (20)ను ఎస్సై వి.చక్రధర్ ఆధ్వర్యంలో అనకాపల్లి టౌన్ పోలీసులు 2020 ఆగస్టు 28న అరెస్టు చేశారు. తుమ్మపాల గ్రామం చినబాబు కాలనీ వద్ద వాహన తనిఖీలు నిర్వహించి చోడవరం వైపు నుంచి అనకాపల్లి వస్తున్న అనుమానాస్పద ఆటోను ఆపుతుండగా అందులో ఉన్న ముగ్గురు నిందితులు పారిపోయే ప్రయత్నం చేశారు. వారిలో గోలారి మహేశ్వర్ అలియాస్ మహేష్ పోలీసులకు పట్టుబడగా మిగతా ఇద్దరు నిందితులు పరారయ్యారు. ఆటోను తనిఖీ చేయగా అందులో 44 కేజీల గంజాయి లభ్యమయింది. నిందితుడిని అరెస్టు చేసి, గంజాయిని, వాహనాన్ని స్వాధీనం చేసుకున్నారు. విచారణ పూర్తయిన తర్వాత సాక్ష్యాధారాలను బట్టి 10వ అదనపు జిల్లా న్యాయమూర్తి నందనవనం శ్రీవిద్య ముద్దాయి గోలారి మహేశ్వర్‌కు 15 సంవత్సరాల కఠిన కారాగార శిక్ష, రూ.2 లక్షల జరిమానా, జరిమానా కట్టని పక్షంలో మరో 6 నెలలు జైలు శిక్ష విధిస్తూ తీర్పు వెల్లడించారని ఎస్పీ తెలిపారు. ఈ కేసులో పీపీ వద్దాది వెంకట్రావు, ఇన్‌చార్జ్ పీపీ సిహెచ్.వీరకృష్ణ వినిపించిన వాదనలు సమర్థిస్తూ న్యాయమూర్తి తీర్పును వెల్లడించారు. ఎస్పీ తుహిన్ సిన్హా అనకాపల్లి టౌన్ ఎస్‌హెచ్‌వో ఎల్.భాస్కరరావు, ఎస్సై వి.చక్రధర్, పోలీసులు సిబ్బంది, పీపీలను అభినందించారు.

చింతపల్లి డీఎస్పీగా షేక్ షాహ్బాజ్ అహ్మద్

చింతపల్లి: డీఎస్పీగా షేక్ షాహ్బాజ్ అహ్మద్ నియమితులయ్యారు. 2022 బ్యాచ్‌కు చెందిన ఆయన శిక్షణ అనంతరం గ్రేహౌండ్స్ విభాగంలో విధులు నిర్వహిస్తున్నారు. తాజా బదిలీల్లో ఆయనను చింతపల్లి డీఎస్పీగా నియమిస్తూ డీజీపీ ఉత్తర్వులు జారీచేశారు. ఈ మేరకు శనివారం ఆయన బాధ్యతలు స్వీకరించనున్నట్టు తెలిసింది. ఇక్కడ రెండేళ్ల పాటు చింతపల్లి ఏఎస్పీగా పనిచేసిన కొమ్మి ప్రతాప్ శివ కిశోర్ ఏలూరు ఎస్పీగా పదోన్నతిపై నెల రోజుల క్రితం బదిలీ కావడం తెలిసిందే.

అనకాపల్లి రైల్వే స్టేషన్‌లో పార్శిల్ కార్యాలయం మూసివేత

అనకాపల్లి: స్థానిక రైల్వే స్టేషన్‌లో గల పార్శిల్ కార్యాలయాన్ని మూసివేశారు. ఆన్‌లైన్ ద్వారా మాత్రమే కార్యకలాపాలు నిర్వహించాలని రైల్వే ఉన్నతాధికారులు ఆదేశాలు జారీ చేయడంతో దేశవ్యాప్తంగా గల మాన్యువల్ కార్యాలయాలను మూసివేశారు. దీనిలో భాగంగా అనకాపల్లి కార్యాలయాన్ని కూడా శుక్రవారం నుంచి మూసివేశారు. వివిధ ప్రాంతాలకు పార్శిళ్లు బుక్‌చేసుకునే అనకాపల్లి జిల్లా వాసులు ఇకపై విశాఖ లేదా సామర్లకోట రైల్వే స్టేషన్లలో మాత్రమే బుక్ చేసుకునే అవకాశం కల్పించారు. పార్శిల్ కార్యాలయాన్ని మూసివేయడంతో ఇక్కడ పనిచేస్తున్న 12 మంది కళాసీలకు ఉపాధి లేకుండా పోయింది. ఈ సందర్భంగా రైల్వే కళాసీలు కె.సత్తిబాబు, ఎన్.శ్రీను, పి.బుజ్జి, అప్పలరాజు, ఏడుకొండలు, పి.రమణ మాట్లాడుతూ 30 సంవత్సరాలుగా అనకాపల్లి రైల్వేస్టేషన్ పార్శిల్ కార్యాలయంలో విధులు నిర్వహిస్తున్నామని, కేంద్రాన్ని మూసివేయడంతో ఉపాధి కోల్పోయామని చెప్పారు. అనకాపల్లి రైల్వే స్టేషన్ మీదుగా దేశంలో వివిధ ప్రాంతాలకు పార్శిళ్లు పంపే ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడే పరిస్థితి ఏర్పడుతుందన్నారు.

అదృశ్యమైన యువకుడి కథ విషాదాంతం

- శారదానదిలో మృతదేహం లభ్యం
- ఈఎంఐలు కట్టలేదని మందలించిన తల్లిదండ్రులు


రాకేష్ మెలిపాక (ఫైల్)

మునగపాక: తల్లిదండ్రులు మందలించడంతో ఇంటి నుంచి వెళ్లిపోయిన ఓ యువకుడి శారదానదిలో శవమై తేలాడు. పోలీసులు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. మెలిపాకకు చెందిన ద్వారపూడి గోపి కుమారుడు రాకేష్(23) ఐటీఐ చదువుకున్నాడు. ఇటీవల ఫైనాన్స్‌పై బైక్ కొనుగోలు చేశాడు. ఇందుకు సంబంధించి ఈఎంఐలు సక్రమంగా చెల్లించకపోవడంతో కుటుంబ సభ్యులు మందలించారు. దీంతో గత నెల 30న సాయంత్రం 6 గంటలకు ఇంటి నుంచి రాకేష్ బయటకు వెళ్లిపోయాడు. రాత్రికి రాకపోయే సరికి ఆందోళనకు గురైన కుటుంబ సభ్యులు చుట్టు పక్కలతో పాటు స్నేహితుల ఇళ్ల వద్ద వెతికారు. అయినా ఆచూకీ లభించకపోవడంతో మునగపాక పోలీసులకు ఫిర్యాదు చేశారు. యువకుడి అదృశ్యం కింద కేసు నమోదు చేసిన పోలీసులు గాలింపు చర్యలు చేపట్టారు. విషయం తెలుసుకున్న తహసీల్దార్ ఆదిమహేశ్వరరావు కూడా రాకేష్ కోసం శారదానదిలో గాలింపు చర్యలు చేయించారు. శుక్రవారం ఉదయం మెలిపాక శివారు చినయాదగిరిపాలెం సమీపంలోని శారదానదిలో రాకేష్ మృతదేహం కనిపించినట్టు స్థానికులు పోలీసులకు సమాచారం ఇచ్చారు. ఈ మేరకు రాకేష్ తల్లి వరలక్ష్మి ఇచ్చిన ఫిర్యాదు మేరకు ఎస్ఐ ప్రసాదరావు కేసు నమోదు చేసి మృతదేహాన్ని అనకాపల్లి వంద పడకల ఆస్పత్రికి తరలించారు.

10 కేజీల గంజాయి పట్టివేత


పట్టుకున్న గంజాయితో పోలీసులు

గొలుగొండ: కృష్ణదేవిపేట పోలీస్ స్టేషన్ పరిధిలో అక్రమంగా 10 కేజీల గంజాయి తరలిస్తున్న ఇద్దర్నీ పోలీసులు అదుపులోకి తీసుకుని, కేసు నమోదు చేశారు. ఎస్ఐ తారకేశ్వరరావు తెలిపిన వివరాలిలా ఉన్నాయి. జి.మాడుగుల మండలానికి చెందిన కొండపల్లి లక్ష్మణరావు, కొండపల్లి చంద్రశేఖర్ గోనె సంచిలో 10 కేజీల గంజాయి వేసుకుని తరలిస్తున్నారు. స్థానిక చెరకు తూనిక కేంద్రం వద్ద వాహన తనిఖీలు నిర్వహిస్తున్న సమయంలో పోలీసులకు అనుమానం వచ్చి వారిని తనిఖీ చేయగా గంజాయి ఉన్నట్లు గుర్తించి అదుపులోకి తీసుకున్నారు. నిందితులపై కేసు నమోదు చేసి, కోర్టులో హాజరు పరిచినట్టు ఎస్ఐ తెలిపారు.

వేర్వేరు చోట్ల అగ్ని ప్రమాదాలు


జాలంపల్లిలో దగ్ధమవుతున్న ఇల్లు


మెటల్ స్టోర్స్ దుకాణంలో మంటలను అదుపు చేస్తున్న అగ్నిమాపక శాఖ సిబ్బంది


క్యారీ లారీక్యాబ్‌లో మంటలను అదుపుచేస్తున్న అగ్నిమాపక సిబ్బంది

జిల్లాలో వేర్వేరు ప్రాంతాల్లో గురు, శుక్రవారాల్లో అగ్ని ప్రమాదాలు సంభవించాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా జరిగిన ఈ ప్రమాదాల్లో భారీగా ఆస్తి నష్టం వాటిల్లింది. అగ్నిమాపక సిబ్బంది సకాలంలో స్పందించి మంటలను అదుపు చేయడంతో ఆయా ప్రాంతాల ప్రజలు ఊపిరి పీల్చుకున్నారు.

మాడుగుల: మండలంలో జాలంపల్లి గ్రామంలో గురువారం సాయంత్రం విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా రెండిళ్లు దగ్ధమయ్యాయి. వివరాలిలా ఉన్నాయి. గ్రామానికి చెందిన యడ్ల సతీష్, ముచ్చకర్ల భూలోకతల్లీ పక్కపక్క ఇళ్లలో నివాసం ఉంటున్నారు. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా ఇళ్లలో మంటలు చెలరేగాయి. ఈ ఘటనలో విద్యుత్ మీటర్లు, నిత్యావసర సరకులు, సుమారు 30 ధాన్యం బస్తాలు, దుస్తులు, టీవీ, తదితర వస్తువులు కాలిబూడిదయ్యాయి. ఆ సమయంలో ఇంటిలో ఎవరూ లేకపోవడంతో ప్రాణనష్టం తప్పింది. సమాచారం అందుకున్న మాడుగుల అగ్ని మాపక సిబ్బంది సంఘటనా స్థలానికి చేరుకుని మంటలను అదుపు చేశారు. దీంతో చుట్టుపక్కలకు మంటలు వ్యాపించలేదు. స్థానిక రెవెన్యూ ఇన్‌స్పెక్టర్ లక్ష్మణరావు, స్థానిక వీఆర్వోలు సంఘటన స్థలాన్ని పరిశీలించారు. ప్రభుత్వానికి నివేదిక పంపిస్తామన్నారు. ప్రభుత్వం స్పందించి తమను ఆదుకోవాలని బాధితులు కోరారు.

మెటల్ షాప్ దగ్ధం

అనకాపల్లి: స్థానిక గాంధీ కురగాయల మార్కెట్‌కు సమీపంలోని శ్రీవర ఎంటర్ ప్రైజెస్ అండ్ మెటల్ స్టోర్స్‌లో శుక్రవారం తెల్లవారుజామున అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా మెటల్ స్టోర్స్ అగ్నికి ఆహుతైంది. విషయం తెలుసుకున్న అగ్నిమాపక శాఖ అధికారి పి.నాగేశ్వరరావు తమ సిబ్బందితో మూడు ఫైరింజిన్ల సహాయంతో సుమారుగా 2 గంటల పాటు శ్రమించి మంటలు అదుపు చేశారు. సుమారుగా ఆస్తి నష్టం రూ.25 లక్షలు ఉంటుందని అంచనా వేశారు. షాపు యాజమాని పి.వరప్రసాద్ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసినట్లు అగ్నిమాపకశాక అధికారి నాగేశ్వరరావు తెలిపారు.

క్వారీ లారీ క్యాబిన్‌లో అగ్ని ప్రమాదం

అనకాపల్లి: మండలంలో మార్టూరు పంచాయతీ మాకవరం గ్రామంలో గురువారం తెల్లవారుజామున శ్రీకృష్ణ స్టోన్ క్రషర్‌కు చెందిన లారీ క్యాబిన్‌లో అగ్ని ప్రమాదం సంభవించింది. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా క్యాబిన్ మొత్తం దగ్ధమైంది. సంఘటనా స్థలానికి అనకాపల్లి అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగేశ్వరావు తమ సిబ్బందితో హుటాహుటిన చేరుకుని మంటలను అదుపు చేశారు. ప్రమాద సమయంలో లారీలో ఎవరూ లేరు. సుమారుగా రూ.5 లక్షల ఆస్తి నష్టం జరిగిందని అంచనా. లారీ ఓనర్ ఆర్.వి.సుబ్రహ్మణ్యం ఇచ్చిన ఫిర్యాదు మేరకు అగ్నిమాపకశాఖ అధికారి పి.నాగేశ్వరరావు కేసు నమోదు చేశారు.

'కూటమి' వచ్చాకే ఉక్కుకు మరిన్ని కష్టాలు

సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ


మాట్లాడుతున్న సీపీఐ రాష్ట్ర కార్యదర్శి రామకృష్ణ

సీతంపేట : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత విశాఖ స్టీల్‌ప్లాంట్‌కు మరిన్న కష్టాలు ఎదురవుతున్నాయని సీపీఐ రాష్ట్ర కార్యదర్శి కె.రామకృష్ణ పేర్కొన్నారు. ద్వారకానగర్ పౌరగ్రంథాలయంలో వామపక్ష పార్టీలు, కేంద్ర కార్మిక సంఘాల ఆధ్వర్యంలో గురువారం జరిగిన సదస్సులో ఆయన మాట్లాడారు. ఎన్నికలకు ముందు విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా చంద్రబాబు, పవన్ కల్యాణ్ ధ్వజమెత్తారని, అధికారంలోకి వచ్చాక కేంద్రం చెప్పినట్టు వ్యవహరిస్తుండడం సరికాదన్నారు. అనేక రకాలుగా స్టీల్‌ప్లాంట్ కుంటుపడేలా ప్రభుత్వం వ్యవహరిస్తోందన్నారు. చంద్రబాబు, పవన్ కల్యాణ్‌పై ఒత్తిడి తేవాల్సిన అవసరం ఉందన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమాన్ని రాష్ట్ర స్థాయికి తీసుకువెళ్లాల్సిన అవసరం ఉందని, విశాఖ స్టీల్‌ప్లాంట్ పరిరక్షణ పోరాటం కార్మికులకు మాత్రమే పరిమితం కాకూడదని, దీనిని ప్రజా పోరాటంగా ముందుకు తీసుకువెళ్లాలని కోరారు. ఢిల్లీలో కూడా పోరాట కార్యక్రమాలు నిర్వహించాలన్నారు. విశాఖ ఉక్కు ప్రైవేటీకరణకు వ్యతిరేకంగా జరుగుతున్న ఉద్యమంపై ఈ నెల 7వ తేదీన విజయవాడలో వామపక్ష పార్టీల సమావేశం జరుగుతుందని, ఉద్యమాన్ని పతాక స్థాయికి తీసుకువెళ్లడంపై చర్చిస్తామన్నారు. సీపీఐ రాష్ట్ర సహాయ కార్యదర్శి జేవీ సత్యనారాయణమూర్తి మాట్లాడుతూ అధికారంలోకి వచ్చాక ముఖ్యమంత్రి చంద్రబాబు పలుసార్లు ప్రధాని మోదీని కలిసినా స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై మాట్లాడలేదని విమర్శించారు. సీపీఎం జిల్లా కార్యదర్శి ఎం.జగ్గునాయుడు మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ ప్రైవేటీకరణపై విశాఖ ఎంపీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌లు స్పందించాలని డిమాండ్ చేశారు. ఈ సమావేశంలో కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు ఏవీ రవివర్మ, సీఐటీయూ జిల్లా కార్యదర్శి ఆర్.కె.ఎస్.వి.కుమార్, ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు జాన్సన్ బాబు, సీపీఐ విశాఖ జిల్లా కార్యదర్శి మరుపిళ్ల పైడిరాజు, వామపక్ష పార్టీల నాయకులు, ప్రజా సంఘాల ప్రతినిధులు వై. కొండయ్య, ఆడారి అప్పారావు, ఎం.రామచంద్రరాజు, కె.దేవా, కె.శంకరరావు పాల్గొన్నారు.

స్విమ్మింగ్ పూల్‌లో యువకుడి దుర్మరణం

- స్నేహితుడి జన్మదిన వేడుకల్లో విషాదం మద్యం సేవించి ఈత కొట్టిన వంశీ


స్నేహితుడికి కేక్ తినిపిస్తున్న వంశీ (సర్కిల్)

పద్మనాభం: రేవిడిలోని ఆర్.కె.లేఅవుట్ వద్ద ఉన్న కురసా రిసార్ట్ స్విమ్మింగ్ పూల్‌లో ఓ యువకుడు మృతి చెందాడు. పోలీసులు, స్థానికులు తెలిపిన వివరాలివీ.. భీమునిపట్నం మండలం కృష్ణరాజుపేటకు చెందిన టీడీపీ నాయకుడు గుడ్డాల ఎల్లయ్య కుమారుడు రవితేజతో పాటు వి.కుమార్, డి.స్వామి రేవిడిలో రిసార్ట్ నడుపుతున్నారు. ఎంవీపీకాలనీకి చెందిన బండ్రెడ్డి అభిషేక్ వంశీ(23)తో సహా ఏడుగురు గత నెల 30న రాత్రి రిసార్ట్‌కు వచ్చారు. ఏడుగురిలో ఒకరి పుట్టినరోజు కావడంతో.. కేక్ కటింగ్ అనంతరం పూటుగా మద్యం సేవించారు. తర్వాత రిసార్ట్‌లోని స్విమ్మింగ్ పూల్‌లో ఈతకు దిగారు. వీరిలో ఆరుగురు స్నానం చేసి రూమ్‌కు వెళ్లిపోయారు. అభిషేక్ వంశీ ఎంతకు రాకపోడంతో అర్ధరాత్రి దాటిన తర్వాత రెండు గంటల సమయంలో స్విమ్మింగ్ పూల్ వద్ద వెతికారు. వంశీ నీటిపై తేలుతూ కనిపించడంతో వెంటనే సంగివలస ఎన్ఆర్ఐ ఆస్పత్రికి తీసుకెళ్లారు. అప్పటికే వంశీ మృతి చెందినట్టు వైద్యులు నిర్ధారించారు. ఆస్పత్రి వర్గాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు పోలీసులు తెలిపారు. మృతుడు తండ్రి రాంబాబు విశాఖ డెయిరీలో సూపర్‌వైజర్‌గా పనిచేస్తున్నారు. తల్లి, సోదరుడు ఉన్నారు.